సాక్షి నిర్మల్

శనివారం । 3 । జూన్ । 2023



కలెక్టరేట్‌ను పరిశీలించిన కలెక్టర్

నిర్మల్‌ఖిల్లా: జిల్లా కేంద్రంలో నిర్మాణం పూర్తిచేసుకున్న నూతన కలెక్టరేట్‌ను కలెక్టర్ వరుణ్‌రెడ్డి, అడిషనల్ కలెక్టర్ రాంబాబుతో కలిసి శుక్రవారం సాయంత్రం పరిశీలించారు. ఆదివారం ప్రారంభోత్సవం ఉన్నందున అధికారులు, సిబ్బందికి సూచనలు చేశారు.



నేడు రైతు దినోత్సవం

నిర్మల్: రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం జిల్లాలో తెలంగాణ రైతు దినోత్సవం నిర్వహించనున్నారు. ఈమేరకు 79 రైతువేదికల్లో ఏర్పాట్లు చేశామని, ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
41.8 /29.6

ఆకాశంలో అక్కడక్కడా మబ్బులు ఉంటాయి. ఎండ తీవ్రత కొనసాగుతుంది. మధ్యాహ్నం తర్వాత వేడి, ఉక్కపోత అధికంగా ఉంటుంది. వేడిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

నిర్మల్ కళాకారునికి గవర్నర్ ప్రశంస



ప్రశంసాపత్రం అందిస్తున్న గవర్నర్ తమిళిసై

నిర్మల్‌ఖిల్లా: జిల్లా కేంద్రానికి చెందిన కొయ్య బొమ్మల కళాకారుడు నాంపల్లి రాజశేఖరవర్మ రాష్ట్ర గవర్నర్ తమిళిసై చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకున్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవంలో భాగంగా రాజ్ భవన్‌లో శుక్రవారం ప్రత్యేక స్టాళ్లు ఏర్పాటు చేశారు. ఇందులో చేర్యాల పెయింటింగ్స్, నిర్మల్ కొయ్య బొమ్మలు, నిర్మల్ ఫర్నిచర్స్, పెంబర్తి మెటల్ క్రాఫ్ట్, ఆదిలాబాద్ డోక్రా వారిచే ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. అనంతరం స్టాళ్లను పరిశీలించిన గవర్నర్ కళాకారులకు ప్రశంసాపత్రాలు అందించి అభినందించారు. నిర్మల్‌కు చెందిన కొయ్యబొమ్మల కళాకారుడు నాంపల్లి రాజశేఖరవర్మను ప్రత్యేకంగా తయారీ వివరాలు అడిగి తెలుసుకుని అభినందించారు.

దశాబ్ది ఉత్సవాలు చరిత్రాత్మకం

నిర్మల్ రూరల్: ఎందరో పోరాటయోధుల ప్రాణత్యాగంతోనే తెలంగాణ ఆవిర్భవించిందని జెడ్పీచైర్‌పర్సన్ విజయలక్ష్మి అన్నారు. జిల్లా కేంద్రంలోని జెడ్పీ కార్యాలయంలో శుక్రవారం తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. అమరులకు నివాళులు అర్పించారు. సీఈవో సుధీర్ ,కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

5 నుంచి రేషన్ డీలర్ల సమ్మె

నిర్మల్ రూరల్: తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చనందున నిరసనగా ఈనెల 5 నుంచి నిరవధిక సమ్మె చేయనున్నట్లు రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు పతికే రాజేందర్ తెలిపారు. గత నెలలో సమ్మె చేసిన కారణంగా మంత్రి గంగుల కమలాకర్ కొన్ని స్పష్టమైన హామీలు ఇచ్చారని పేర్కొన్నారు. ఇప్పటికీ అవి నెరవేర్చలేదన్నారు. వేతన పెంపు జీవో జూన్ 1లోపు ఇస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. హామీలు నెరవేర్చనందున ఈనెల 3, 4 తేదీల్లో రేషన్ దుకాణాలు తెరవకుండా 5వ తేదీ నుంచి పూర్తి సమ్మెకు పోవాలని జిల్లా కమిటీ నిర్ణయించినట్లు వివరించారు. జిల్లాలోని డీలర్లు అందరూ రాష్ట్ర జేఏసీ నిర్ణయం వచ్చేవరకు సమ్మె కొనసాగించాలని కోరారు.

సీఎంగారు.. హామీల సంగతేంది?

- కేసీఆర్‌కు 'ఏలేటి' బహిరంగ లేఖ



లేఖ చూపుతున్న మహేశ్వర్‌రెడ్డి

నిర్మల్: జిల్లా పర్యటనకు వస్తున్న సీఎం కేసీఆర్ గతంలో జిల్లాకు ఇచ్చిన హామీల సంగతేంటో చెప్పాలంటూ మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈమేరకు జిల్లాకేంద్రంలోని తన నివాసంలో శుక్రవారం కేసీఆర్‌కు రాసిన బహిరంగ లేఖను విడుదల చేశారు. ముఖ్యమంత్రి పర్యటనను తాము స్వాగతిస్తున్నామని తెలిపారు. కానీ.. ఎన్నికలకు ముందు నిర్మల్‌కు ఇచ్చిన హామీల గురించి తేల్చాలని డిమాండ్ చేశారు. 2018 ఎన్నికల సభలో ముఖ్యమంత్రి స్వయంగా ఇచ్చిన హామీలను ఇంకా నెరవేర్చలేదని గుర్తుచేశారు. ఇక్కడ ఉపాధి లేక వేలాదిమంది నిరుద్యోగులు గల్ఫ్ దేశాల్లో మగ్గుతున్నారని, హామీల ప్రకారం పరిశ్రమలు స్థాపించి ఉపాధి కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. సాగునీటి ప్రాజెక్టులు ఉన్నా అనుబంధ పరిశ్రమలు స్థాపించకుండా నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. ప్రాణహిత, చేవెళ్ల ప్యాకేజీ కెనాల్స్‌తో గుంట భూమికి కూడా సాగు నీరు ఇవ్వడం లేదన్నారు. నిర్మల్ ప్రజల చిరకాల ఆకాంక్ష అయిన రైల్వేలైన్ హామీని నెరవేర్చలేదని గుర్తుచేశారు.

భూముల విలువ పెంచుకునేందుకే..

జిల్లా మంత్రి సొంత భూముల విలువ పెంచుకునేందుకు ప్రజలకు అనువుగా లేని ప్రాంతాల్లో కలెక్టరేట్, మెడికల్‌కాలేజీ నిర్మించారని ఆరోపించారు. ని ర్మల్ పట్టణంలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ ఎప్పుడు చేపడతారని ప్రశ్నించారు. నిర్మల్ మున్సిపాలిటీలో 44 ఉద్యోగాల అక్రమ నియామకాల విషయంలో బా ధ్యులపై చర్యలు తీసుకోవాలని, చెరువుల కబ్జాలు, డీ1 పట్టాల పేరుతో చేసిన ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని బహిరంగలేఖలో సీఎంను కోరారు. స మావేశంలో బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్నగారి భూమయ్య, పెద్దపల్లి జిల్లా ఇన్‌చార్జి రావుల రాంనాథ్, సీనియర్ నాయకుడు అంజుకుమార్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్‌రెడ్డి, దొడ్డికింది ముత్యం రెడ్డి, ప్రజ్యోత్ పాల్గొన్నారు.

ప్రగతి పరుగు..



జాతీయ పతాకం ఆవిష్కరిస్తున్న మంత్రి ఐకేరెడ్డి



రాష్ట్ర అవతరణ దినోత్సవం దశాబ్ది వేడుకలకు హాజరైన మంత్రి కుటుంబ సభ్యులు, అధికారులు, నాయకులు



వేడుకల్లో నృత్యం చేస్తున్న చిన్నారి



మాట్లాడుతున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

- అమరుల త్యాగఫలం తెలంగాణ
- స్వరాష్ట్రంలో ప్రగతి సాధించాం
- మరింత అభివృద్ధి సాధిద్దాం
- దశాబ్ది ఉత్సవాల్లో భాగమవుదాం
- ఆవిర్భావ వేడుకల్లో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి
- కలెక్టరేట్‌లో జాతీయ పతాకావిష్కరణ
- జిల్లా ప్రగతిపై సందేశం





సాంస్కృతిక వేడుకల్లో నృత్యం చేస్తున్న చిన్నారులు









వేడుకల్లో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, కలెక్టర్ వరుణ్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

నిర్మల్: అమరవీరుల ప్రాణత్యాగాలు, ఎంతోమంది ఉద్యమకారుల పోరాటాల ఫలితంగా తెలంగాణను సాధించుకున్నామని, స్వరాష్ట్రంలో నిర్మల్ జిల్లా గణనీయమైన అభివృద్ధి సాధిస్తోందని, గ్రామీణాభివృద్ధి, విద్య తదితర రంగాల్లో రాష్ట్రస్థాయిలో ముందుందని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ, న్యాయశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం దశాబ్ది ఉత్సవాల ప్రారంభాన్ని జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఆవరణలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి హాజరై పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం జాతీయ జెండా ఎగురవేశారు. తర్వాత జిల్లా ప్రగతి నివేదికను తన ఆవిర్భావ దినోత్సవ సందేశ రూపంలో వినిపించారు.

వ్యవసాయం సుసంపన్నం..

తెలంగాణ ఏర్పాటైనప్పటి నుంచి సీఎం కేసీఆర్ వ్యవసాయాభివృద్ధే ధ్యేయంగా ఎన్నో మార్పులను తీసుకువచ్చారన్నారు. రైతుబంధు, రైతుబీమా, వ్యవసాయానికి 24 గంటలపాటు ఉచితవిద్యుత్, రుణ మాఫీ, కల్తీవిత్తనాల నియంత్రణ, రైతువేదికలు ఇలా ఎన్నో పథకాలను అమలు చేస్తున్నామని చెప్పారు. పండిన ప్రతిగింజనూ కొనుగోలు చేసి రైతుకు అండగా నిలుస్తుండటంతో సాగు సుసంపన్నమైందని తెలిపారు.

సాగుకు, తాగుకు పుష్కలంగా నీళ్లు..

జిల్లాలో కాళేశ్వరం ప్రాజెక్టు 27వ ప్యాకేజీ ద్వారా 99 గ్రామాల్లో 50 వేల ఎకరాలు, 28 ప్యాకేజీ కింద 58 గ్రామాల్లో మరో 50 వేల ఎకరాలు సాగవుతోందని తెలిపారు. సదర్మట్ బ్యారేజీ ద్వారా నిర్మల్, జగిత్యాల జిల్లాల్లో ఆయకట్టుకు నీరందనుందని చెప్పారు. భారీవర్షాలకు దెబ్బతిన్న చెరువుల మరమ్మతులకు రూ.114.89 లక్షల పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. మిషన్ భగీరథ ద్వారా జిల్లాలోని 692 గ్రామాలు, మూడు మున్సిపాలిటీలకు తాగునీరందించేందుకు రూ.1,318 కోట్లతో ఇంటెక్‌వెల్స్, పైప్‌లైన్స్ పూర్తిచేశామన్నారు.

'ఉపాధి'లో ఫస్ట్..

ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో కూలీలకు పని కల్పించడంలో రాష్ట్రంలోనే నిర్మల్ జిల్లా ప్రథమస్థానంలో ఉండటం గర్వకారణమన్నారు. హరితహారంలో ఈ ఏడాది 39.60 లక్షల మొక్కల లక్ష్యాన్ని పూర్తిచేశామన్నారు. కొయ్యబొమ్మలను తయారు చేసే పొనికి కర్ర కోసం రెండెకరాల్లో పొనికి వనం ఏర్పాటు చేశామన్నారు. బ్యాంక్ లింకేజీలో 2022–23కు గానూ 6,803 సంఘాలకు రూ.379.03 కోట్లు మంజురూ చేశామని తెలిపారు. బ్యాంక్ లింకేజీలో నిర్మల్ జిల్లా ప్రథమస్థానంలో, స్త్రీనిధి మంజూరులో రెండోస్థానంలో నిలవడం విశేషమన్నారు. అటవీశాఖ ద్వారా జిల్లాలోని ఖానాపూర్ డివిజన్‌లోని మైసంపేట, రాంపూర్ గ్రామాలను కవ్వాల్ టైగర్ రిజర్వ్ నుంచి తరలించామన్నారు. కోర్ ఏరియాలో ఉన్న 142 కుటుంబాలకు పునరావాస పనులు కొనసాగుతున్నాయన్నారు. దిమ్మదుర్తి పరిధిలోని దుర్గం చెరువు వద్ద ఎకోటూరిజం కేంద్రం ఈఏడాది అమలులోకి వస్తుందని తెలిపారు.

వైద్యం.. ఆరోగ్యం..

వైద్యరంగంలో జిల్లా ఎన్నడూ లేనంత అభివృద్ధిని సాధిస్తోంది. జిల్లాకు నూతనంగా మెడికల్ కాలేజీ రావడం, టీహబ్ ఏర్పాటు, జిల్లా ఆస్పత్రిని ఉన్నతీకరించడం, బస్తీదవాఖానాల ప్రారంభం, పలు నూతన ఆస్పత్రి భవనాల నిర్మాణం, వైద్యుల నియామకం ఇలా వైద్యంలో ఎన్నో మార్పులు వచ్చాయని వివరించారు. కంటివెలుగు రెండోవిడతలో ఇప్పటివరకు 3,08,723మందిని పరీక్షించినట్లు చెప్పారు. జిల్లాలో మాతృ మరణాలను అరికట్టేందుకు, ప్రజల ఆరోగ్యాన్ని మెరుగు పర్చేందుకు కలెక్టర్ వరుణ్‌రెడ్డి ప్రత్యేకంగా 'ఎనిమియా ముక్త్ నిర్మల్' కార్యక్రమాన్ని చేపట్టారని మంత్రి పేర్కొన్నారు.

సబ్బండవర్గాల సంక్షేమం..

దళితబంధు ద్వారా నిర్మల్ నియోజకవర్గంలో 100, ముధోల్–100, ఖానాపూర్‌లో 61 ఎస్సీ కుటుంబాలను ఎంపిక చేశామన్నారు. ఇప్పటి వరకు రూ.25.84 కోట్లను 261మంది లబ్ధిదారులు వారు ఎంచుకున్న పథకాల గ్రౌండింగ్ కోసం వారి ఖాతాలలో జమ చేశామన్నారు. విద్యా ఉద్యోగాల్లో గిరిజనులకు 10శాతం రిజర్వేషన్ కల్పించిన విషయాన్ని గుర్తుచేశారు. పోడుభూములకు సంబంధించి గిరిజనులకు అటవీహక్కు పత్రాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని మంత్రి వెల్లడించారు.

కలిసికట్టుగా ముందడుగు..

జిల్లాలో అన్నిశాఖలు ప్రగతి పథంలో వెళ్తున్నాయని, తెలంగాణ దశాబ్ది ఉత్సవాల స్ఫూర్తితో మరింత ముందడుగు వేద్దామని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి పిలుపునిచ్చారు. పోరాడి సాధించుకున్న తెలంగాణలో ఏర్పాటు చేసుకున్న నిర్మల్ జిల్లాను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు కలిసికట్టుగా పనిచేయాల్సిన అవసరముందన్నారు. జిల్లా ముందు ఉన్న లక్ష్యాల సాధనకోసం, ప్రజలకు మెరుగైన పాలన అందించేందుకు మరింతగా పనిచేస్తామని చెప్పారు. ఈనెల 22 వరకు కొనసాగే దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, కలెక్టర్ వరుణ్‌రెడ్డి, ఎస్పీ ప్రవీణ్‌కుమార్, అడిషనల్ కలెక్టర్ రాంబాబు, జెడ్పీ సీఈవో సుధీర్, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యలో ప్రథమస్థానం..

జిల్లా విద్యాశాఖ ద్వారా ప్రణాళికబద్ధంగా విద్యారంగాన్ని బలోపేతం చేస్తున్నామన్నారు. ఈ ఏడాది రాష్ట్రంలోనే పదోతరగతి ఫలితాల్లో జిల్లా ఫస్ట్ రావడంతో గర్వకారణమన్నారు. జిల్లాలో ప్రభుత్వ బడుల దశను మార్చేందుకు మనఊరు–మనబడి కార్యక్రమం ద్వారా 12 రకాల అంశాలలో పనులు చేపడుతున్నట్లు వివరించారు. మొదటి విడతలో 260 పాఠశాలలను ఎంపిక చేసి, రూ.82 కోట్లతో పనులు చేపట్టినట్లు తెలిపారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు..

'ఇదేరా తెలంగాణ.. ఉద్యమాల ఇలాఖారా..' అంటూ మరోసారి తెలంగాణ ఉద్యమాన్ని గుర్తుచేసేలా జానపదపాటలతో, సాంస్కృతిక నృత్యాలతో చిన్నారులు అలరించారు. కలెక్టరేట్ ప్రాంగణంలో నిర్వహించిన తెలంగాణ ఆవిర్భావ వేడుకలో పలువురు చిన్నారులు తమ కళను ప్రదర్శించారు. కాకలు తీరిన యోధులెందరో.. ముద్దుగారే యశోదా.. తందాన భలే తందనాన.. తదితర పాటలతో అలరించారు. స్థానిక సోఫినగర్ బాలికల గురుకులం విద్యార్థినులు జాతీయ గీతాన్ని ఆలపించారు. తెలంగాణ సాంస్కృతిక సారథి బృందం కార్యక్రమాలూ ఆకట్టుకున్నాయి. కార్యక్రమానికి బి.వెంకట్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

'గుండే'.. గోడు పట్టేనా?

- ముంపు గ్రామానికి పునరావాసం కరువు
- డబుల్‌బెడ్‌రూం ఇళ్లలో తాత్కాలిక నివాసం
- సీఎం పర్యటనపై గుండేగాం వాసుల ఆశలు

భైంసా/భైంసారూరల్: భైంసా మండలం వాడి గ్రామం వద్ద నిర్మించిన పల్సికర్ రంగారావు ప్రాజెక్టు నీళ్లు గుండేగాంలోకి చొచ్చుకురావడంతో ఏటా గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారు. ఊరు మునిగిన ప్రతీసారి అధికారులు వచ్చి ఓదార్చడం తప్ప శాశ్వత పరిష్కారం కనిపించడంలేదు. తొమ్మిదేళ్లుగా గుండేగాం వాసులకు పునరావాసంపై స్పష్టమైన ప్రకటన రావడంలేదు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈనెల 4న సీఎం కేసీఆర్ నిర్మల్‌కు వస్తున్నారు. సీఎం కేసీఆర్‌పైనే గుండేగాం వాసులు ఆశలు పెట్టుకున్నారు. గతనెల 31న ఆర్డీవో రవికుమార్, భైంసా తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి గుండేగాంలో గ్రామసభ నిర్వహించి అక్కడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. పునరావాసం కోసం అధికారులు నిర్ణయించిన పరిహారం వివరాలను గ్రామస్తుల ముందు ఉంచారు. ఏవైనా ఫిర్యాదు ఇవ్వాలనుకున్నా సలహాలు, సూచనలు చేయాలన్న రాత పూర్వకంగా ఇవ్వాలని అధికారులు గ్రామస్తులను కోరారు.

రాకపోకలకు బ్రేక్...

గుండేగాం మీదుగా వాగుపై నిర్మించిన బ్రిడ్జి వర్షం కురిస్తే నీటిలో మునిగిపోతుంది. పల్సికర్ రంగారావు ప్రాజెక్టులోకి చేరిన నీరంతా బ్రిడ్జిని ముంచెత్తి గుండేగాం గ్రామంలోకి చొచ్చుకువస్తుంది. దీంతో ఏటా వర్షాకాలంలో ఈ బ్రిడ్జిపై రాకపోకలకు బ్రేక్ పడుతుంది. వర్షాలు కురిసినప్పుడల్లా మహాగాం, పార్డి(బి), చాత, మహారాష్ట్రవైపు వెళ్లేవారంతా మాటేగాం మీదుగా ఎగ్గాం, బిజ్జూర్ గ్రామాలను కలుపుతూ ఉన్న రోడ్డుపై ప్రయాణిస్తున్నారు. నీరు తగ్గేవరకు ఇదే పరిస్థితి ఉంటుంది. వర్షాలు కురిస్తే ప్రమాదాలు జరుగకుండా పోలీసులతో రాకపోకలు నియంత్రించడం తప్ప శాశ్వత పరిష్కారం చూపడం లేదు. ఈయేడు కూడా వర్షాలు కురిస్తే ఇవే కష్టాలు వెంటాడనున్నాయి.

శాశ్వత పరిష్కారంలేక...

గుండేగాం పునరావాసానికి ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపడంలేదు. ఏటా అక్కడి కష్టాలు చూసి వచ్చిన అధికార యంత్రాంగం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడం చర్చించి గ్రామస్తులను మెప్పించడం వరకే పరిమితమవుతుంది. పునరావాసం లేక స్థానికులు కష్టాలు పడుతునే ఉన్నారు. ప్రస్తుతం గుండేగాం గ్రామస్తులు కమలాపూర్ గుట్టవద్ద ప్రభుత్వం నిర్మించిన డబుల్‌బెడ్‌రూం ఇళ్లలో తాత్కాలికంగా నివాసం ఉంటున్నారు. గత ఏడాది భారీ వర్షాలు కురిసినవెంటనే నీటమునిగిన ఇళ్లలోని బాధితులంతా ఇక్కడికి వచ్చేశారు. అప్పటి నుంచి ఈ డబుల్‌బెడ్‌రూం ఇళ్లలోనే ఉంటున్నారు.

రోజూ కష్టాలే...

డబుల్‌బెడ్‌రూం ఇళ్లలో ఉండేవారంతా ప్రతీరోజు తమ పిల్లలను పాత గ్రామానికి వెళ్లి బడికి పంపుతున్నారు. ఇక వ్యవసాయ భూములు మహాగాం, చింతల్‌బోరి గ్రామాలకు ఆనుకుని ఉన్నాయి. రోజు ఇక్కడి నుంచి నాలుగు కిలోమీటర్ల మేర నడిచి పొలాలకు వెళ్తున్నారు. గుండేగాంలో ఉంటే వర్షాలు కురిస్తే ఇళ్లు కూలుతాయన్న భయం ఇక్కడ ఉంటే రోజు నడిచివెళ్లే ఇబ్బందులు గ్రామస్తులను వెంటాడుతున్నాయి.

సర్వే జరిగినా...

నాలుగేళ్ల క్రితమే గుండేగాం గ్రామంలో రెవెన్యూ, ఇరిగేషన్, పోలీసు అధికారులు సర్వే నిర్వహించారు. పల్సికర్ రంగారావు ప్రాజెక్టులో నీరుచేరితే గ్రామంలోకి బ్యాక్‌వాటర్ వస్తుందని తేల్చారు. భారీ వర్షాలు కురిసిన ప్రతీసారి గ్రామంలోకి బ్యాక్‌వాటర్ వస్తుందని అధికారులే చెప్పారు. అప్పటి నుంచి కలెక్టర్లు, మంత్రులు, ఇరిగేషన్ అధికారులు ఇలా అందరూ, రావడం గ్రామస్తులను మెప్పించడం తిరిగివెళ్లడం జరుగుతుంది.

గతనెల 31న గ్రామసభ...

త్వరలో వర్షాకాలం ప్రారంభం కానుంది. వానలు కురిసే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో గతనెల 31న ఆర్డీవో రవికుమార్, తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి సమక్షంలో గ్రామసభ నిర్వహించారు. ఈ గ్రామసభలో ప్రభుత్వం నిర్ణయించిన పరిహారం వివరాలను అధికారులు వెల్లడించారు. గుండేగాం గ్రామంలో గతంలో నిర్వహించిన సర్వేల ఆ ధారంగా పరిహారం ప్రకటించారు. 454 కుటుంబాలకు పరిహారం లెక్కించారు. ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద అధికారులు నిర్ణయించిన పరిహా రాన్ని వెల్లడించారు. ఒక్కో కుటుంబానికి రూ. 5 లక్షల చొప్పున పరిహారం ఇవ్వనున్నట్లు అధికా రులు తెలిపారు. ఒక్కొ కుటుంబానికి ఏడాది భృతికింద రూ. 36 వేలు, గ్రామం నుంచి కుటుంబం తరలివెళ్లేందుకు ట్రాన్స్‌పోర్ట్ చార్జి రూ.50 వేలు, వన్‌టైం రీ సెటిల్‌మెంట్‌లోభాగంగా అలవెన్స్ కింద రూ.50 వేలు, పశువుల పాకలకు రూ.25 వేలు, సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ పర్సన్స్‌కు రూ.25 వేలు ఇలా పరిహారం వివరాలను గ్రామస్తుల ముందు ఉంచారు. 454 కుటుంబాలకుగాను పునరావాసం, భూములు, ఇతర వాటికి రూ.61 కోట్లు ఇవ్వనున్నట్లు అధికారులు వెల్లడించారు. గ్రామస్తుల అభిప్రాయం మేరకు పునరావాసం కోసం స్థలం వివరాలను సైతం సూచించారు. అందరి అభిప్రాయం మేరకే పునరావాసం కల్పిస్తామని అధికారులు స్పష్టంచేశారు.



గుండేగాం గ్రామంలోకి చొచ్చుకువచ్చిన వరద(ఫైల్)

సమావేశం నిర్వహించాం

ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు గుండేగాంలో గ్రామసభ నిర్వహించాం. స్థానికంగా ఉండే కుటుంబీకులతో మాట్లాడాం. ప్రభుత్వం చెల్లించే పరిహారం వివరాలను వెల్లడించాం. పునరావాసం కోసం ప్రభుత్వం కేటాయించిన స్థలం, ఇతర విషయాలను గ్రామసభలో తెలియజేశారు. ఏవైనా అభ్యంతరాలు ఉంటే రాతపూర్వకంగా తెలపాలని సూచించాం.

– చంద్రశేఖర్‌రెడ్డి, తహసీల్దార్

'దశాబ్ది' పురస్కారాలు



ప్రశంసాపత్రం అందుకుంటున్న జిల్లా ప్రణాళిక అధికారి మల్లికార్జున్



డీఈవో రవీందర్‌రెడ్డి



డీపీవో అంజిప్రసాద్



డీఆర్డీవో విజయలక్ష్మి



జెడ్పీ సీఈవో సుధీర్ కుమార్



రాజ్‌కుమార్, ఫిషర్‌మెన్



పౌరసరఫరాల శాఖ సీనియర్ అసిస్టెంట్ రాంప్రసాద్



కలెక్టరేట్ డీటీ ప్రవీణ్ కుమార్



సీనియర్ అసిస్టెంట్ సుజాత



మామడ తహసీల్దార్



ఉద్యమకారుడు సంతోష్



సారంగాపూర్ ఎంపీడీవో

తెలంగాణ ఆవిర్భావ దినోత్సవంతోపాటు దశాబ్ది ఉత్సవాల సందర్భంగా పలువురు జిల్లా అధికారులు, ఉద్యోగులు, సిబ్బందికి మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి శుక్రవారం ప్రశంసాపత్రాలు అందించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో మంత్రితోపాటు జెడ్పీచైర్‌పర్సన్ విజయలక్ష్మి, కలెక్టర్ వరుణ్‌రెడ్డి, ఎస్పీ ప్రవీణ్‌కుమార్ ప్రశంసాపత్రాలు ప్రదానం చేశారు. - నిర్మల్

పోరాటాలు, అమరుల త్యాగఫలమే తెలంగాణ

- ఎస్పీ ప్రవీణ్‌కుమార్

నిర్మల్ టౌన్: ఎంతోమంది ఉద్యమకారుల పో రాటాలు, అమరవీరుల ప్రాణ త్యాగాల ఫలి తమే నేటి తెలంగాణ అని ఎస్పీ ప్రవీణ్‌కుమార్ అన్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఎస్పీ క్యాంప్, జిల్లా పోలీస్, సా యుధ దళ కార్యాలయాల్లో జాతీయ జెండా ఆవిష్కరించారు. అంతకుముందు పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. పోరాడి సాధించుకున్న రాష్ట్రాన్ని బంగారు తెలంగాణగా మార్చేందుకు పోలీస్ శాఖ కూడా బాధ్యతగా పనిచేస్తుందని వివరించారు. ధనిక, పేద తేడా లేకుండా అందరికీ ఒకే రకమైన సేవలు అందించాలన్నారు.



గౌరవ వందనం స్వీకరిస్తున్న ప్రవీణ్ కుమార్

కార్యక్రమంలో భైంసా ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్, నిర్మల్ డీఎస్పీ జీవన్‌రెడ్డి, డీసీఆర్బీ డీఎస్పీ రవీందర్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, పట్టణ సీఐ మల్లేశ్, ఎస్‌బీ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

కళాశాలలో ప్రవేశాలకు కౌన్సెలింగ్‌

ఉట్నూర్‌రూరల్‌: తెలంగాణ గిరిజన గురుకులం ఆధ్వర్యంలో పీవీటీజీ విద్యార్థిని, విద్యార్థుల కోసం హయత్‌నగర్‌, హైదరాబాద్‌లోని జూనియర్‌ కళాశాలలో ఇంటర్‌ మొదటి సంవత్సరం ప్రవేశానికై ఈ నెల 6న మంగళవారం ఉట్నూర్‌ కేబీ ప్రాంగణంలోని గిరిజన బాలికల జూనియర్‌ కళాశాలలో కౌన్సెలింగ్‌ నిర్వహించనున్నట్లు గురుకులాల రీజినల్‌ కోఆర్డినేటర్‌ గంగాధర్‌ శుక్రవారం తెలిపారు. పదోతరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ, గ్రూపుల్లో ప్రవేశం పొందుటకై ఉమ్మడి జిల్లాలోని కొలాం, తోటి, మన్నె గిరిజన తెగలకు చెందిన బాల బాలికలు కౌన్సెలింగ్‌కు హాజరు కావాలన్నారు. ప్రవేశం పొందిన వారికి కళాశాలలో ఉచిత వసతి, భోజనంతో పాటు జేఈఈ/ఎన్‌ఈఈటీ/ఎంసెట్‌/సిఎల్‌ఎటి కోచింగ్‌ ఇవ్వడం జరుగుతుందన్నారు. టెన్త్‌లో వచ్చిన జీపీఏ మార్కుల ప్రకారం ప్రవేశంలో ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు.

జాతీయ సెమినార్‌కు ముఖరా(కె) సర్పంచ్‌


సర్పంచ్‌ గాడ్గే మీనాక్షి

ఇచ్చోడ: ఈ నెల 5న ఢిల్లీలో నిర్వహించే జాతీయ పర్యావరణ సెమినార్‌లో పాల్గొనాలని ఆహ్వానం అందినట్లు ముఖరా (కె) సర్పంచ్‌ గాడ్గే మీనాక్షి శుక్రవారం తెలిపారు. కేంద్ర పర్యావరణ శాఖ ఆధ్వర్యంలో ఢిల్లీలో సెమినార్‌ నిర్వహిస్తున్నట్లు తెలిపింది. పంచాయతీ పరిధిలో లక్ష మొక్కలు నాటి పర్యావరణం కోసం ప్రత్యేక కృషి చేసినందుకు పర్యావరణ కేంద్ర మంత్రిత్వశాఖ నుంచి ఆహ్వానం అందినట్లు తెలిపింది.

అగ్ని ప్రమాదంలో పశువుల పాక దగ్ధం


దగ్ధమైన పశువుల పాక

తాంసి: మండల కేంద్రంలో శుక్రవారం ఉదయం ప్రమాదవశాత్తు నిప్పు అంటుకుని పశువుల పాక పూర్తిగా దగ్ధమైంది. పశువుల పాకలో నిల్వ ఉన్న పశుగ్రాసంతో పాటు స్ప్రింక్లర్లు, వ్యవసాయ సామగ్రి పూర్తిగా కాలిబూడిదైంది. పంటచేలల్లో వ్యర్థాలను కాల్చే క్రమంలో నిప్పు రవ్వలు ఎగిసిపడి గోవర్ధన్‌రెడ్డికి చెందిన పశువుల పాకపై పడి మంటలు అంటుకున్నాయి. స్థానికులు గమనించి మంటలు ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో రూ.లక్ష వరకు నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపాడు.

తృటిలో తప్పిన పెనుప్రమాదం


ప్రమాదానికి గురైన కారు

భైంసారూరల్‌: మండలంలోని దేగాం గ్రామ సమీపంలో బీజేపీ ముధోల్‌ నియోజకవర్గ నాయకులు మోహన్‌రావు పటేల్‌ రోడ్డు ప్రమాదంలో స్వల్పంగా గాయపడ్డాడు. శుక్రవారం పల్లె పల్లెకు బీజేపీ గడపగడపకూ మోహన్‌రావుపటేల్‌ కార్యక్రమం కోసం ముధోల్‌ మండలానికి వెళ్తుండగా దేగాం గ్రామ శివారులో వీరి వాహనాన్ని ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో స్వల్ప గాయాలయ్యాయి. పలువురు నాయకులు అతడిని పరామర్శించారు.

'మంచినీళ్ల'లా ఖర్చు

చంద్రశేఖర్‌ వృత్తిరీత్యా ఓ ప్రైవేట్‌ ఉద్యోగి, భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి నిర్మల్‌ జిల్లా కేంద్రంలో ఓ అద్దె ఇంట్లో నివాసముంటున్నాడు. తనకొచ్చే ఇరవై వేల జీతంలో నెలవారి ఖర్చుల్లో దాదాపు రూ.1200 –1500 వరకు మినరల్‌ వాటర్‌కే వెచ్చిస్తున్నాడు. కుటుంబంతో బయటకి వెళ్లినప్పుడు కూడా వాటర్‌ బాటిళ్లు కొని తాగుతుంటాడు. ఇలా అధికంగా వాటర్‌ తాగేందుకు ఖర్చు చేస్తున్నాడు. ఇది కేవలం చంద్రశేఖర్‌ పరిస్థితి మాత్రమే కాదు.. ప్రతి ఒక్కరిదీ ఇలాంటి పరిస్థితే..


నిబంధనలు పాటించకుండా కొనసాగుతున్న వాటర్‌ ప్లాంట్‌

- కుటుంబ ఖర్చులో పెరుగుతున్న మంచినీటి వాటా ..
- మినరల్‌ వాటర్‌ డబ్బాల వాడకానికే జనం మొగ్గు
- పాలఖర్చుతో నీటి ఖర్చు పోటీ....
- పట్టణాలతో పాటు పల్లెలకు పాకిన మినరల్‌ సంస్కృతి
- అప్రమత్తత అవసరమంటున్న ఆరోగ్యనిపుణులు

కుటుంబ ఖర్చులో మంచినీటి వాటా...

నలుగురు సభ్యులున్న కుటుంబం రోజుకు సగటున 20లీటర్ల వాటర్‌ క్యాన్‌ను వినియోగిస్తుంది. ఆ 20లీటర్ల వాటర్‌ క్యాన్‌ ప్రాంతాన్ని బట్టి రూ.15 నుంచి 20 వరకు విక్రయిస్తున్నారు. డోర్‌ డెలివరీ చేస్తే అదనంగా మరో రూ.10–15 వసూలు చేస్తున్నారు. ఇలా ఒక కుటుంబం రోజుకు సగటున రూ.30 చొప్పున నెలకు రూ.900వరకు వెచ్చిస్తోంది. ఇది కాకుండా ఆ కుటుంబంలో ఎవరైనా బయటకు వెళ్లాల్సి వస్తే వాటర్‌ బాటిల్‌ను కొని తాగుతున్నారు. లీటరు వాటర్‌ బాటిల్‌ ఖరీదు రూ.20 ఉంది. ఇలా నెలలో సగటున ఐదారు బాటిళ్లు తాగినా రూ.100 వరకు ఖర్చవుతోంది. అంటే నెలకు రూ.వెయ్యి చొప్పున ఏడాదికి రూ.12 వేలు కేవలం మంచినీళ్లకే వెచ్చించాల్సి వస్తోంది. ఇక కార్యాలయాలకు 20 లీటర్ల వాటర్‌ క్యాన్‌ రూ.25–30కు సరఫరా చేస్తున్నారు. మారిన పరిస్థితుల్లో కూలింగ్‌ మినరల్‌ వాటర్‌ పేరిట కూడా నీటిని అమ్ముతున్నారు. 20 లీటర్ల కూలింగ్‌ క్యాన్‌కు రూ.40–50 వరకు వసూలు చేస్తున్నారు.


అపరిశుభ్ర వాతావరణంలో నీటిడబ్బాలు

నిర్మల్‌ఖిల్లా: జీవకోటికి నీరే ప్రధానం. అలాంటి నీరు ప్రస్తుత తరుణంలో తాగేందుకు పనికిరాకుండా పోతోంది. దీంతో నిర్మల్‌, ఖానాపూర్‌, భైంసా తదితర పట్టణాల్లో దాదాపు 70శాతం మందికిపైగా ప్రజలు మినరల్‌ వాటర్‌ డబ్బాలను వినియోగించేందుకు మొగ్గు చూపుతున్నారు. గ్రామాల్లో సైతం సగానికి పైగా ఈ మినరల్‌ వాటర్‌ క్యాన్లకే అలవాటు పడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా దాదాపు 300వరకు వాటర్‌ప్లాంట్లు ఉన్నట్లు అనధికార అంచనా. ఇందులో 80శాతానికి పైగా ప్లాంట్లకు సరైన అనుమతులు లేవని తెలుస్తోంది.

పాలతో నీళ్లకు పోటీ..

ప్రస్తుతం మార్కెట్‌లో అర లీటరు పాల ప్యాకెట్‌ ధర.30 నుంచి 40 వరకు ఉంది. పాలకు వెచ్చించే సొమ్ము గరిష్టంగా రూ.900 అవుతుంది. అంటే పాలతో నీళ్ల ధర పోటీ పడుతోందని స్పష్టమవుతోంది. మినరల్‌ వాటర్‌పై మోజుకు ఇది అద్దం పడుతోంది.

ఆదాయ వనరుగా..

ప్రజల తాగునీటి అవసరాలను ఆదాయ వనరుగా మార్చుకున్న వ్యాపారులు విచ్చలవిడిగా వాటర్‌ ప్లాంట్లను ఏర్పాటుచేస్తున్నారు. కనీస ప్రమాణాలు పాటించకుండా వాటర్‌ప్లాంట్లను నిర్వహిస్తున్నారు. అధికారుల నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా.. మినరల్‌ వాటర్‌ పేరుతో జనరల్‌ వాటర్‌ అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారు. హోటళ్లు, చిరువ్యాపారులు, మధ్య తరగతి ప్రజలు మినరల్‌ వాటర్‌ కొనడంతో నీటి వ్యాపారం అధికమైంది.

నాణ్యతలేని మినరల్‌ వాటర్‌తో ఆరోగ్యసమస్యలు..



నాణ్యతలేని మినరల్‌ వాటర్‌ ఆరోగ్యానికి అంత మంచిది కాదు. వీటిని తాగడంతో అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయి. వీటిని తాగడంతో కిడ్నీల్లో రాళ్లు, తక్కువ వయసులోనే మోకాళ్ల నొప్పులు ఏర్పడే అవకాశం ఉంది. ప్లాస్టిక్‌ బాటిల్స్‌, వాటర్‌ క్యాన్లలో వచ్చే నీటిలో శరీరానికి అవసరమైన కాల్షియం, సోడియం, ఫాస్పరస్‌, సల్ఫర్‌, మెగ్నీషియం వంటి మినరల్స్‌ లోపిస్తాయి. క్యాన్సర్‌ కారకాలుగా పనిచేస్తాయి. – డాక్టర్‌ నాళం శశికాంత్‌, లాప్రోస్కోపిక్‌ సర్జన్‌, నిర్మల్‌

తప్పనిసరి పరిస్థితుల్లో...



ఉద్యోగరీత్యా నిర్మల్‌ పట్టణంలో ఉంటున్నాం. మాకున్న ఆర్థిక పరిస్థితుల వల్ల మేము వాటర్‌ ప్లాంట్‌ నుంచి ఇంటికి డోర్‌ డెలివరీ తెచ్చే వాటర్‌ క్యాన్‌ను తీసుకుని తాగుతున్నాం. వీటికి ప్రతీనెల సుమారు రూ.1000 ఖర్చవుతోంది. వాటర్‌ ప్లాంట్‌లపై సంబంధిత అధికారులు నిఘా పెంచాలి. నీటి నాణ్యతలను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలి. నియమ నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలి. – చాట్ల రమేష్‌, ప్రైవేట్‌ ఉపాధ్యాయుడు, నిర్మల్‌

మనస్తాపానికి గురై ఒకరి ఆత్మహత్య

భైంసాటౌన్‌: పట్టణంలోని ఏపీనగర్‌కు చెందిన ఎన్‌ సాయినాథ్‌(35) మనస్తాపానికి గురై గురువారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై ఎండీ గౌసుద్దీన్‌ కథనం ప్రకారం.. సాయినాథ్‌ కొన్నేళ్లుగా అనారోగ్యం(ఫిట్స్‌)తో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసయ్యాడు. తనకు పెళ్లి చేయాలంటూ కుటుంబ సభ్యులతో గొడవ పడేవాడు. గురువారం సైతం ఇదే విషయమై గొడవపడ్డాడు. రాత్రి 8గంటల ప్రాంతంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నాడు. 10గంటల ప్రాంతంలో అతడి సోదరుడు దాబాపై నుంచి కిందకు వచ్చి చూడగా ఉరేసుకుని కనిపించాడు. ఎస్సై ఎండీ గౌసుద్దీన్‌ చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం ఏరియాస్పత్రికి తరలించారు. మృతుడి తల్లి భారతిబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

ధర్మ పరిరక్షణ అందరి బాధ్యత


ప్రతిష్ఠాపనలో పాల్గొన్న మున్సిపల్‌ చైర్మన్‌

ఆదిలాబాద్‌: సనాతన ధర్మ పరిరక్షణ అందరి బాధ్యత అని ఆదిలాబాద్‌ మున్సిపల్‌ చైర్మన్‌ జోగు ప్రేమేందర్‌ అన్నారు. జిల్లా కేంద్రంలోని కుమ్మరి కుంట కాలనీలోని 21 అడుగుల ఆంజనేయ స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి శుక్రవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భక్తిభావం వెల్లివిరిసేలా ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తుండడం అభినందనీయమన్నారు. కాలనీవాసులంతా ఐక్యంగా ఉండి భారీ ఆంజనేయ స్వామి విగ్రహాన్ని ఏర్పాటు చేసుకోవడం పట్ల అభినందనలు తెలియజేశారు. సనాతన విలువలను భావితరాలకు అందజేయడానికి ఇటువంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయని వెల్లడించారు. కార్యక్రమంలో కౌన్సిలర్‌ ఆవుల వెంకన్న నాయకులు మిష్న, భూమన్న కాలనీవాసులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఇంటి పెద్దదిక్కు.. ఆ చిన్నారి

- కిడ్నీ వ్యాధితో మంచానికే పరిమితమైన తండ్రి
- ఎనిమిదేళ్ల క్రితం తల్లి మృతి
- మానసిక వికలాంగురాలైన సోదరి
- అన్నీతానై కుటుంబ భారం మోస్తున్న చిన్నారి
- మాటలు రాకపోయినా కడుపు నింపుతున్న వైనం..



ఆ కుటుంబాన్ని చూస్తే ఎవరికైనా గుండె తరుక్కుపోవాల్సిందే. తల్లి ఎనిమిదేళ్ల క్రితం అనారోగ్యంతో మృతిచెందింది. తండ్రి కిడ్నీ వ్యాధితో మంచానికే పరిమితమయ్యాడు. అక్క మానసిక వికలాంగురాలు. ఎనిమిదేళ్ల ఆ చిన్నారికి మాటలు రావు(మూగ). అయినా ఆ కుటుంబానికి పెద్దదిక్కుగా మారింది. అన్నీతానై కుటుంబాన్ని చూసుకుంటోంది. ఉండేందుకు సరైన ఇళ్లు లేదు. ఎలాంటి ఆదాయ వనరులు లేకపోవడంతో ఇంటింటా తిరుగుతూ కుటుంబం కడుపునింపుతోంది.


ఉంటున్న ఇల్లు


ఇద్దరు కూతుర్లతో తండ్రి మలారి సింగ్‌

బోథ్‌: మండలంలోని గుర్రాలతండా గ్రామానికి చెందిన మలారిసింగ్‌, ఊర్మిళకు నలుగురు కూతుర్లే. రెండవ కూతురు సరిత మానసిక వికలాంగురాలు. నాల్గో కూతురు గంగోత్రి మూగ. గంగోత్రి ఏడాది కాకముందే 2015లో అనారోగ్యంతో తల్లి ఊర్మిళ మృతిచెందింది. దీంతో కూతుర్లను తండ్రి మలారిసింగ్‌తో పాటు నాన్నమ్మ భాగవతిబాయి చూసుకున్నారు. 2016లో పెద్ద కూతురు కల్పనకు పెళ్లి చేశాడు. 2017లో నాన్నమ్మ భాగవతిబాయి మృతి చెందింది. అప్పటి నుంచి తండ్రి మలారిసింగ్‌ కూలీ పనిచేస్తూ కూతుర్లను పెంచాడు. 2022లో మూడో కూతురు మీనాక్షికి సైతం వివాహం చేశాడు.

విధి వంచించడంతో...

ఇద్దరు కూతుళ్లకు పెళ్లిళ్లు చేసి మరో ఇద్దరు కూతుర్లను చూసుకుంటున్న తండ్రి మలారిసింగ్‌కు ఏడాది క్రితం కిడ్నీ సంబంధిత వ్యాధి సోకింది. దీంతో ఆయన మంచానికే పరిమితమయ్యాడు. దీంతో కుటుంబ పరిస్థితి చిన్నాభిన్నమైంది. పూటగడవం కష్టంగా మారడంతో మూగ అమ్మాయి గంగోత్రి ఇంటింటా తిరుగుతూ కావాల్సిన భోజనం సమకూరుస్తుంది. అక్క సరితకు, తండ్రి మలారిసింగ్‌ కడుపు నింపుతోంది.

కుటుంబ బరువు మోస్తున్న చిన్నారి...

నడవలేని స్థితిలోని తండ్రికి ప్రతి రోజు సపర్యలు చేస్తుంది. స్నానం చేయించడం మొదలు అన్నం తినిపించే వరకు అన్నీతానై చూసుకుంటుంది ఆ చిన్నారి. అక్క సరిత మానసిక వికలాంగురాలు కావడంతో ఎటువెళ్లినా గ్రామంలో వెతికి ఇంటికి తీసుకు వస్తుంది. మాటలు రాకపోయినా ఆ చిన్నారి కుటుంబానికి పెద్ద దిక్కుగా నిలుస్తోంది.

చికిత్సకు డబ్బులు లేక...

మలారిసింగ్‌ కనీసం చికిత్స చేసుకోలేని దుర్భర స్థితిలో ఉన్నాడు. గతంలో వైద్యులు రాసిచ్చిన మందులనే ఎవరైనా కొనిస్తే వాడుకుంటున్నాడు. చికిత్సకు, డయాలసిస్‌ చేయించుకోవడానికి ఆర్థిక స్తోమత లేక తల్లడిల్లుతున్నాడు. దాతలు స్పందించి ఆ చిన్నారి కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

స్పందించాల్సిన దాతలు...
చౌహాన్‌ వినోద్‌ : గూగుల్‌ పే, ఫోన్‌ పే
7670921393

ఐటీడీఏలో దశాబ్ది ఉత్సవాలు


నృత్యం చేస్తున్న విద్యార్థినులు


ప్రశంసాపత్రాలు ఇస్తున్న శిక్షణ సహాయ కలెక్టర్‌

ఉట్నూర్‌రూరల్‌: ఉట్నూర్‌ ఐటీడీఏ కార్యాలయ ఆవరణలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆదిలాబాద్‌ శిక్షణ సహాయ కలెక్టర్‌ పి.శ్రీజ పాల్గొని అంబేద్కర్‌, గాంధీ చిత్రపటాలకు పూలమాలలు వేసి మాట్లాడారు. ఐటీడీఏ పరిధిలోని పీవీటీజీ గ్రామాల్లో గిరి పోషణ కార్యక్రమం ద్వారా 12371 గర్భిణులకు, బాలింతలకు, 3–6 సంవత్సరాల పిల్లలకు ఆరు రకాల పోషక ఆహార పదార్థాలు అందిస్తున్నట్లు తెలిపారు. అదనపు జిల్లా, ఆరోగ్యశాఖ అధికారి పరిధిలో 32 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 186 ఉప ఆరోగ్య కేంద్రాలు, 6 సామాజిక ఆరోగ్య కేంద్రాల ద్వారా ఆరోగ్య సేవలు అందిస్తున్నాయన్నారు. ఉట్నూర్‌ ఆస్పత్రిలో ఎస్‌ఆర్‌సీ, ఎస్‌ఎన్‌సీయూ ద్వారా నవజాత శిశువులకు, తల్లులకు పౌష్టికాహారలేమితో బాధపడుతున్న వారికి వైద్య సేవలు అందించడం జరుగుతుందని, కిడ్నీ బాధితుల కోసం డయాలసిస్‌ కేంద్రంలో ఇప్పటి వరకు 6044 మందికి వైద్య సేవలు అందించినట్లు వివరించారు. అదే విధంగా ఉమ్మడి ఆదిలాబాద్‌ జిల్లా యందు గిరిజన సహకార సంస్థ, ఐటీడీఏ ఉట్నూర్‌ ఆధ్వర్యంలో 17 పెట్రోల్‌ పంపులు ఏర్పాటుకు ప్రతిపాదనలు రూపొందించడం జరిగిందని అందులో 6 పెట్రోల్‌ పంపులు స్థాపించి నిరుద్యోగ గిరిజన యువతి, యువకులకు ఉపాధి కల్పించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా చేసిన సాంస్కృతిక నృత్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం ఉద్యోగులకు, విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందచేశారు. కార్యక్రమంలో ఏటీడబ్ల్యూఏసీ చైర్మన్‌ కనక లక్కేరావు, డీడీ దిలీప్‌కుమార్‌, ఏపీవో జనరల్‌ భీంరావు, ఈఈ భీంరావు, ఏవో రాంబాబు పాల్గొన్నారు.

నియోజకవర్గానికి స్వాతంత్య్రం ఇంకా రాలేదు

- మాజీ ఎంపీ రాథోడ్‌ రమేశ్‌


మాట్లాడుతున్న మాజీ ఎంపీ రాథోడ్‌ రమేశ్‌

పెంబి: తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించి పదేళ్లు గడుస్తున్నా సందర్భంలో ఊరురా దశాబ్ది వేడుకలు జరుపుకుంటున్నప్పటికీ ఖానాపూర్‌ నియోజకవర్గానికి ఇంకా స్వాతంత్య్రం రాలేదని మాజీ ఎంపీ, నియోజకవర్గ బీజేపీ నాయకులు రాథోడ్‌ రమేష్‌ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో బీజేపీ మండల కార్యవర్గ సమావేశానికి హాజరై మాట్లాడారు. బీజేపీ గ్రామ బూత్‌ అధ్యక్షులు సైనికుడిలా పనిచేయాలని, రానున్న రోజుల్లో తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వమే పాలిస్తుందన్నారు. దీనికోసం గ్రామాల్లోని బీజేపీ బూత్‌ కమిటీ అధ్యక్షులు, కార్యకర్తలు పట్టుదలతో పనిచేయాలన్నారు. గిరిజన గ్రామాల్లో ఇప్పటికీ రోడ్లు, కరెంట్‌, కనీస నీటి సౌకర్యం లేదన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ జానుబాయి, నియోజకవర్గ నాయకులు పడాల రాజశేఖర్‌, మండల అధ్యక్షుడు సదాశివ్‌ ఉన్నారు.

ట్రాక్టర్‌ బోల్తా పడి యువకుడి మృతి

కౌటాల: మండలంలోని బోదంపల్లి గ్రామానికి చెందిన మోర్లె రాజేందర్‌ (20) అనే యువకుడు ట్రాక్టర్‌ బోల్తా పడి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం .. గ్రామానికి చెందిన మోర్లె పున్నయ్య–సావిత్రి దంపతులకు ముగ్గురు కుమారులు. చిన్న కుమారుడు రాజేందర్‌ కౌటాలలోని ట్రాక్టర్‌ గ్యారేజీలో మెకానిక్‌గా పని చేస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం బోదంపల్లి గ్రామానికి చెందిన యాటకారి కమలాకర్‌కు చెందిన ట్రాక్టర్‌ను డ్రైవర్‌ పిడుగు వినోద్‌ గ్రామ శివారులో చేను దున్నడానికి తీసుకెళ్తున్నాడు. ఈక్రమంలో తన స్నేహితుడు పిడుగు సాయితో కలిసి రాజేందర్‌ ట్రాక్టర్‌పై వెళ్లాడు. చేను దున్ని ముగ్గురు ఇంటికి వస్తున్న క్రమంలో ట్రాక్టర్‌ను ఒడ్డు ఎక్కించే క్రమంలో బోల్తాపడింది. దీంతో మోర్లె రాజేందర్‌పై ట్రాక్టర్‌ పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. డ్రైవర్‌ వినోద్‌ కాలు విరిగింది. సాయికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగ్రాతులను కాగజ్‌నగర్‌ ఆస్పత్రికి తరలించారు. రాజేందర్‌ తల్లిదండ్రులు మృతదేహంపై పడి బోరున విలపించారు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించి వివరాలు సేకరించారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధుడు..

భీమిని: మండలంలోని తంగెళ్లపల్లి–వెంకటాపూర్‌ గ్రామాల మధ్య శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారుడు. వివరాలు.. తంగెళ్లపల్లి గ్రామానికి చెందిన రత్నం నాన్నయ్య (60) చీపురు కట్టలు అమ్ముకోవడానికి సూర్జాపూర్‌ గ్రామానికి నడిచి వెళ్తున్నాడు. ఈ క్రమంలో తంగెళ్లపల్లి–వెంకటాపూర్‌ గ్రామాల మధ్య గుర్తు తెలియని వాహనం ఢీకొట్టగా తల పగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. కుమారుడు వెంకటేశం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు కన్నెపల్లి ఎస్సై నరేశ్‌ తెలిపారు.





'ఆచార్యుడి'కి అవమానం

తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం వేడుకలను జిల్లాలో ఘనంగా నిర్వహించారు. నిర్మల్‌ పట్టణంలో అమరవీరుల స్తూపం, ఆచార్య ప్రొఫెసర్‌ జయశంకర్‌ విగ్రహాన్ని ప్రతి రాష్ట్ర అవతరణ దినోత్సవం రోజును పూలతో అలంకరిస్తారు. కానీ ఈ ఏడాది అధికారులు, ప్రజాప్రతినిధులు కనీసం పూలమాలలు కూడా వేయకుండా వదిలేశారు. మున్సిపల్‌ ఎదుట అమరవీరుల స్తూపానికి నివాళులర్పించడం మరిచి అవమానించారు. - సాక్షి, ఫొటోగ్రాఫర్‌ నిర్మల్‌